జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761


epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

సోమవారం | 4-8-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 415 పేజీలు: 4 వెల : రూ.7

# శ్రీకాకుళంలో.. మాఫియా.. పంజా!

* కోర్టు వేలం ఆస్తిని నకిలీ పత్రాలతో కబ్జా యత్నం
* నకిలీ పత్రాల గుట్టురట్టు
* అధికారుల మౌనంపై పలు అనుమానాలు







**శ్రీకాకుళం, ఆగస్టు 3 (వార్త):** జిల్లా కేంద్రంలో మరోసారి నకిలీ పత్రాల మాఫియా గుట్టు రట్టయింది. సుర్యమహల్ దరిలోని జీ.టీ. రోడ్ వద్ద డోర్ నెంబర్ 7-3-174/బి ఆస్తిని కబ్జా చేయడానికి కొందరు వ్యక్తులు తప్పుడు పత్రాలను సృష్టించారు. దాదాపు 40 ఏళ్లుగా యూసఫ్ ఖాన్ కుటుంబం ఆధీనంలో ఉన్న ఈ ఆస్తిని అక్రమంగా కాజేయడానికి గుంటముక్కల దంపతులు ప్రయత్నించగా, బాధితులు కోర్టును ఆశ్రయించి తాత్కాలిక ఊరట పొందారు. ఈ ఘటన జిల్లాలో నకిలీ పత్రాల దందా ఎంత విస్తృతంగా సాగుతుందో మరోసారి రుజువు చేసింది.

కోర్టు వేలంలో దక్కిన ఆస్తిపై కన్ను


ఈ ఆస్తికి సుదీర్ఘ చరిత్ర ఉంది. 1964లో దాఖలైన ఓఎస్ నుం. 16/1964 డిక్రీ ప్రకారం, 1970లో ఈపీ 31/1970 ద్వారా జరిగిన కోర్టు వేలంలో సులేమాన్ ఖాన్ అనే వ్యక్తి ఈ ఆస్తిని దక్కించుకున్నారు. ఆయనకు పెళ్లి కాకపోవడంతో, తన సోదరుల కుటుంబం ఆయన్ను చూసుకుంది. 2013లో సులేమాన్ ఖాన్ ఒక నోటరీ అఫిడవిట్ ద్వారా ఈ ఆస్తిని తన బంధువులైన యూసఫ్ ఖాన్, అజీజ్ ఖాతూన్, షేక్ రెహమాన్ ఖాతూన్, జఫుల్లా ఖాన్, నూర్ ఖాన్‌లకు అప్పగించారు. అప్పటినుంచి వారే ఈ ఆస్తిని స్వాధీనంలో ఉంచుకుని అనుభవిస్తున్నారు.

## అధికారుల మౌనంపై స్థానికుల ప్రశ్నలు

ఈ ఘటనపై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. "తప్పుడు పత్రాలు ఇంత సులభంగా ఎలా తయారవుతున్నాయి? మండల సర్వేయర్ ఇందులో ఎందుకు జోక్యం చేసుకున్నారు? రిజిస్ట్రేషన్, సర్వే శాఖలు నిబంధనలను నిర్లక్ష్యం చేయకపోతే ఇలాంటి దందాలు జరుగుతాయా?" అంటూ ప్రశ్నిస్తున్నారు. జిల్లా కేంద్రంలోనే నకిలీ పత్రాలతో ఆస్తుల కబ్జాకు యత్నాలు జరగడం అధికారుల తీరుపై అనేక సందేహాలను లేవనెత్తుతోంది. బాధితులు న్యాయం కోసం కోర్టు, పోలీసుల చుట్టూ తిరుగుతున్నారు.

## కోర్టు తాత్కాలిక ఉత్తర్వులు

బాధితులు దాఖలు చేసిన O.S. నం. 171/2025 కేసులో, కోర్టు తాత్కాలిక ఇంజక్షన్ ఆర్డర్ జారీ చేసింది (ఐ. ఏ నం. 164/2025). ఈ ఉత్తర్వులతో అక్రమార్కులు తాత్కాలికంగా వెనకడుగు వేసినప్పటికీ, తప్పుడు పత్రాల మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు పోలీసులను ఆశ్రయించారు.







## సర్వేయర్ సహకారంతో నకిలీ పత్రాలు

అయితే, ఇటీవల గుంటముక్కల సీతారత్నం, ఆమె భర్త కోదండం ఆ ఆస్తి తమదంటూ యూసఫ్ ఖాన్ కుటుంబాన్ని బెదిరించడం మొదలుపెట్టారు. మండల సర్వేయర్ సీహెచ్. శివాజీ సహకారంతో తప్పుడు పత్రాలు సృష్టించి, ఆస్తి హక్కులపై సందేహాలు కలిగేలా చేశారు. దీంతో ఆందోళన చెందిన బాధితులు న్యాయం కోసం కోర్టును ఆశ్రయించారు.



## రౌడీషీటర్లకు పోలీస్ కౌన్సెలింగ్

**శ్రీకాకుళం, ఆగస్టు 3(వార్త):** జిల్లాలో ఉన్న పోలీసు స్టేషన్లు పరిధిలో ఉన్న రౌడీషీటర్లు, నేర చరిత్ర గల వారికి జిల్లా పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. శ్రీకాకుళం జిల్లాలో నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా ఎస్పీ శ్రీ కెవి మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్లు పరిధిలో సీఐలు, ఎస్ఐలు రౌడీషీటర్లకు, నేరచరిత్రగలవారికి, పాత నేరస్తులకు, చెడునడవడిక కలిగిన వ్యక్తులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ మేరకు పాత నేరస్థులు, రౌడీ,సస్పెక్ట్ షీటర్లకు కౌన్సెలింగ్ చేసి గంజాయి వంటి మత్తు పదార్థాలు, చెడు అలవాట్లకు స్వస్తి చెప్పి సత్ప్రవర్తనతో మెలగాలని, ఎవరైనా దానికి భిన్నంగా వ్యవహరిస్తే ఉపేక్షిందిలేదని పోలీసులు స్పష్టం చేశారు. ఎక్కడ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా చర్యలు తప్పవని పోలీసు అధికారులు హెచ్చరించారు. పోలీసుల ఆదేశాలు, సూచనలను పెడచెవిన పెట్టి ప్రజా శాంతికి భంగం కలిగిస్తే రౌడీషీటర్లపై చట్టపరమైన మరింత కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

## ఆలయ విశిష్టతలను.. భావితరాలకు.. తెలియజేయాలి

* రాష్ట్ర హోం శాఖా మాత్యులు వంగలపూడి అనిత
* అరసవల్లి, శ్రీకూర్మం దేవస్థానాల్లో పూజలు



**శ్రీకాకుళం, ఆగస్టు 3 (వార్త):** శ్రీకూర్మనాధ స్వామి, అరసవల్లి స్వామి విశిష్టతను భావితరాలకు తెలియజేసేందుకు పురాతన జ్ఞాపకాలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఆదివారం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని దర్శించుకున్న అనంతరం ఆమె శ్రీకూర్మనాధ స్వామి వారిని దర్శించుకుని వేద పండితులు ఆశీర్వచనాలు అందుకున్నారు. శ్రీకూర్మనాధ స్వామి వారి ఆలయంలో ఉన్న వేద పండితులు ఆలయం యొక్క ప్రాముఖ్యతను మంత్రికి వివరించారు. ఆలయంలో గోడలపై ఉన్న మ్యూరల్ పెయిటింగ్ గూర్చి మంత్రికి తెలియజేశారు. ఆలయ కార్యనిర్వాహక అధికారి నరసింహనాయుడు మంత్రికి శ్రీకూర్మనాధ స్వామి వారి చిత్రపటం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలయం యొక్క ప్రాముఖ్యతను తెలియజేసే చిత్రాలు భద్రత, ఆలయం అభివృద్ధి, తదితర వాటిపై దేవాదాయశాఖ మంత్రితో మాట్లాడతానన్నారు. శ్రీకూర్మంలో శ్రీకూర్మనాధ స్వామి వారి దేవస్థానం వద్ద మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఆదివారం ఉదయం శ్రీకాకుళం జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర హోం శాఖ మాత్యులు వంగలపూడి అనితను ముందుగా అరసవిల్లి ఆలయం ఆవరణలో శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కె.వి మహేశ్వర రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి కెవి రమణ, డీఎస్పీలు ప్రసాద్ రావు, శేషాద్రి, సీఐలు ఇమ్మానియేల్ రాజు, పైడిపు నాయుడు,ఇతర పోలీసు అధికారులు ఉన్నారు.



## తాళం వేసిన ఇళ్లే.. టార్గెట్

* దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు అరెస్టు
* ఐదు తులాల బంగారం, 450 గ్రాములు వెండి స్వాధీనం
* కాశీబుగ్గ డీఎస్పీ వెంకటఅప్పారావు



**పలాస, ఆగస్టు 3(వార్త):** పలాస కాశీబుగ్గ పరిసర గ్రామాలలో తాళం వేసి ఉన్న ఇళ్లలో వరుస దొంగతనాలకు పాల్పడిన ఒడిశాకు చెందిన సంతోష్ సాహు, రాజ్ కుమార్ సేతీ, బబుల్ల సేతీలను అరెస్టు చేశామని, వారి నుంచి ఐదు తులాల బంగారం, 450 గ్రాములు వెండి, 8 వేల రూపాయలు నగదు స్వాధీనం చేసుకోవడం జరిగిందని కాశీబుగ్గ డి.ఎస్.పి వి. వెంకటఅప్పారావు తెలిపారు. ఈ చోరీలకు సంబంధించిన వివరాలను కాశీబుగ్గ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వెల్లడించారు. ఈ నిందితులు కాశీబుగ్గ వివేకానందకోలనీ, లక్ష్మీపురం, పెద్ద నారాయణపురం వంటి గ్రామాలలో ఐదు తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీతో పాటు రెండు చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డారన్నారు. గతంలో వీరు ఆంధ్రా, ఒరిస్సా ప్రాంతాలలో మోటారు సైకిళ్లు దొంగతనం చేసిన నేరానికి జైలుశిక్ష సైతం అనుభవించారన్నారు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత తాళాలు వేసి ఉన్న ఇళ్లల్లో దొంగతనాలు చేయడం ప్రారంభించారన్నారు. పలు ఇళ్లల్లో దొంగతనం కేసులపై కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌కు అందిన ఫిర్యాదులు మేరకు పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహించి నిందితులను పట్టుకోవడం జరిగిందన్నారు. ఆదివారం సాయంత్రం దొంగిలించిన బంగారాన్ని కాశీబుగ్గలో విక్రయించేందుకు వీరు వస్తుండగా, కోసంగిపురం జంక్షన్ వద్ద పట్టుకున్నామన్నారు. ఈ కేసులు ఛేదించిన కాశీబుగ్గ సిఐ పి సూర్యనారాయణ, ఎస్ఐ ఆర్ నర్సింహమూర్తి, హెచ్ సిలు ఎ.శ్రీనివాసరావు, గవరయ్య, కానిస్టేబుల్స్ ఉషాకిరణ్, నీలకంఠంలకు కాశీబుగ్గ డి.ఎస్.పి అభినందించారు.



## అసభ్యకర పోస్టులు పెడితే ఇక ఉపేక్షించను

* అధికారంలో ఉన్నా లేకున్నా.. మేమే టార్గెట్ * వైసీపీ నేతలు హుందాగా ప్రవర్తించాలి * మాజీ మంత్రి ప్రోద్బలంతోనే కొందరు రెచ్చిపోతున్నారు * తాను, తన భర్తపై ఒక్క అవినీతి నిరూపిస్తే రాజకీయాలకు గుడ్‌బై * సవాల్ విసిరిన పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## పుట్టిన బిడ్డకు తల్లిపాలు శ్రేయస్కరం



**పలాస, ఆగస్టు 3, (వార్త):** పుట్టిన బిడ్డకు తల్లిపాల శ్రేయస్కరం అని అంగన్వాడి కార్యకర్త కే జ్యోతి అన్నారు. తల్లిపాల వారోత్సవాలు మొగిలిపాడు 1 కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషక ఆహారం, గర్భిణులు తీసుకోవాలో వివరించారు. పుట్టిన పిల్లలకు తల్లిపాలు ఎంతో పౌష్టికాహారమని, తల్లిపాలు అలవాటు చేయాలని తెలిపారు. తల్లులకు తల్లిపాలలో ఉండే పోషకాలు, బాలింతలకు పాలిచ్చే సమ యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. మొగిలిపాడు అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ కార్యకర్త కె జ్యోతి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు బి. నీలవేణి,జి.దాన లక్ష్మి, ఆశ కార్యకర్త కె. శ్రీదేవి, తల్లులు పాల్గొన్నారు.

# అసభ్యకర పోస్టులు పెడితే ఇక ఊపేక్షించను

- అధికారంలో ఉన్నా లేకున్నా.. మేమే టార్గెట్
- వైసీపీ నేతలు హుందాగా ప్రవర్తించాలి
- మాజీ మంత్రి ప్రోద్భలంతోనే కొందరు రెచ్చిపోతున్నారు
- తాను, తన భర్తపై ఒక్క అవినీతి నిరూపిస్తే రాజకీయాలకు గుడ్‌బై
- సవాల్ విసిరిన పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష



**పలాస, ఆగస్టు 3 (వార్త):** అసభ్యకర పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని, సోషల్ మీడియాలో మహిళలను టార్గెట్ చేస్తున్న వారిని శిక్షించేందుకు ఒక చట్టం తీసుకురావాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనితను కోరారు. ఆదివారం పలాస టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పలాస మండలం సున్నా దేవి గ్రామానికి చెందిన దివ్యాంగుడు దున్న బాలకృష్ణ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఆయనకు శారీరక వైకల్యమే కాదు మానసిక వైకల్యం కూడా ఉందని అన్నారు. వైసీపీ అధికారంలోకి రాగానే టిడిపికి చెందిన అనేక మంది పెన్షన్లను రద్దు చేయించిన బాలకృష్ణ తన తల్లికి వితంతు పెన్షన్ కూడా అందజేస్తున్నామని గుర్తు చేశారు. బాలకృష్ణ సోదరుడు ఆర్మీలో ఉద్యోగం చేస్తున్న మానవతా దృక్పథంతో పెన్షన్లను రద్దు చేయకుండా అందజేస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పైన, రాష్ట్ర మంత్రి అచ్చెనాయుడు పైన, తన పైన కూడా సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నాడని, ఆరోపించారు. శనివారం ఒక ఛానల్ లో తన భర్త వెంకన్న చౌదరిపై అసత్యాలు ప్రచారం చేశారని, ఎమ్మెల్యేగా తాను ఖండన ఇస్తే.. ఆ క్లిప్పింగును సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడని అన్నారు. తాను అధికారంలో ఉన్నా లేకున్నా కూడా టార్గెట్ అవుతున్నానని ఇలాంటి తప్పుడు విమర్శలకు భయపడేది లేదని అన్నారు. బాలకృష్ణపై చర్యలు తీసుకోవాలని ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే అప్పలరాజుకు ఐదేళ్లు ప్రజలు అవకాశం ఇస్తే నీచాతి నీచంగా రాజకీయాలను తీసుకొచ్చారని.. తాను విలువలతో పెరిగానని.. విలువలతో ఉన్న టిడిపిలో ఉన్నానని అన్నారు. గతంలో సోషల్ మీడియాను అదుపులోకి పెట్టేందుకు ప్రభుత్వం దృష్టి సారించాలని చట్టాలను మార్చాలని రిజర్వేషన్లు చూడకుండా తప్పు చేసిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. తాము అధికారంలో ఉన్న ప్రతిపక్షంలో ఉన్న తమ కుటుంబంను టార్గెట్ చేస్తూ మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ప్రాద్బలంతో కొంతమంది ఆయన అనుచరులు సోషల్ మీడియాలో తప్పుడు ఆరోపణలతో రెచ్చిపోతున్నారని వారిని కట్టని చేయవలసిన అవసరం ఉందన్నారు. అధికార ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు హుందాగా ప్రవర్తించారని, అప్పలరాజు చేసినటువంటి రాజకీయాలను ఏ ఒక్క నాయకుడు చేయలేదని అన్నారు. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్లలో అరాచకాలు మహిళలపై దౌర్జన్యాలు జరిగాయే తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. తాను గాని తన భర్త వెంకన్న చౌదరిపై గాని ఒక్క అవినీతిని నిరూపిస్తే రాజకీయాలను విరమించుకుంటామని.. లేకుంటే అప్పలరాజు తన చెప్పుతో తానే కొట్టుకోవాలని సవాల్ విసిరారు. బాలకృష్ణ సోషల్ మీడియాలో పెట్టిన క్లిప్పింగులను విలేకరులకు చూపించారు.



## వెంకన్నచౌదరిపై తప్పుడు ప్రచారం

**మందస, ఆగస్టు 3(వార్త):** పలాస నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త వెంకన్నచౌదరిపై తప్పుడు ప్రచారం, రాతలు వచ్చాయని తెలుగుదేశం పార్టీ నాయకులు మండి పడ్డారు. అనంతరం మందస మండలంలోని హరిపురం బాలిగాం జంక్షన్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ మందస మండల అధ్యక్షుడు భావన దుర్యోధన, మందస, బాలిగాం పీఏసీఎస్ ఛైర్మన్లు తమిరియా భాస్కరరావు, లబ్బ రుద్రయ్య, జిల్లా అధికార ప్రతినిధి దాసరి తాతారావు, సీనియర్ నాయకుడు కొర్ల కన్నారావు, రట్టి లింగరాజు, బమ్మిడి కర్రయ్య, చౌదరి మురలీకృష్ణ, ఎం.నవీన్ కుమార్, సాలిన మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ నేతల ఆగ్రహం

ఓ పత్రికలో తమపై వస్తున్న తప్పుడు కథనాలపై వస్తున్నందుకు గాను టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ కథనాలను ఖండిస్తూ కాశీబుగ్గ బస్టాండ్ ప్రక్కనగల ఎన్టీఆర్ విగ్రహం నుంచి మూడు రోడ్ల జంక్షన్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీటీపీసీ చైర్మన్ బాబురావు మాట్లాడుతూ పదవి లేక ఖాళీగా ఉండడంతో మాజీ మంత్రి అప్పలరాజు మతి భ్రమించి మాట్లాడుతున్నాడరన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేకే తెలుగుదేశం పార్టీపై బురద జల్లుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలోనూ, పలాస నియోజకవర్గంలోనూ జరుగుతున్న అభివృద్ధి అప్పలరాజుకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, పిఎసిఎస్ చైర్మన్ వంకల కూర్మారావు, పీరుకట్ల విఠల్, బడ్డ నాగరాజు, లోడగల కామేశ్వారారావు, కుతుం లక్ష్మణ్, రవిశంకర్ గుప్తా, గురిటీ సూర్యానారాయణ, దువ్వాడ శ్రీకాంత్, కొర్ల విష్ణు, కొరికాన శంకర్, యవ్వారి మోహనరావు, సాసుమాన చంద్రమౌళి, సప్ప నవీన్, టీ గంగారాం, డొక్కరి శంకర్, ఎం నరేంద్ర, యాదగిరి, అంబటి కృష్ణమూర్తి, బూర్ల కృష్ణంరాజు టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.





## 7న కామ్రేడ్ సురేఖ పాణిగ్రాహ సంతాప సభ

**పలాస, ఆగస్టు 3 (వార్త):** బొడ్డపాడులో ఈనెల 7న కామ్రేడ్ సురేఖ పాణిగ్రాహ సంతాప సభ నిర్వహిస్తున్నట్ల బొడ్డపాడు గ్రామ ప్రజలు వెల్లడించారు. అమరవీరుల స్మారక భవనంలో కరపత్రాలు ఆవిష్కరణ చేశారు. కామ్రేడ్ సురేఖ పాణిగ్రాహి సంతాప సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. భారత విప్లవోద్యమంలో అమరులైన అమరవీరుల స్మరిస్తూ ఆనాడు పాణిగ్రహి ప్రజా ఉద్యమంలో పాల్గొన్నప్పుడు సురేఖ పాణిగ్రహి ఆయన జీవిత సహచరినిగా చేదోడు వాదోడుగా నిలబడ్డారు. ఎర్రజెండాను సమన్నతంగా నిలబెట్టడంలో ఆమె వంతుగా ఆమె కృషి చేశారు. సురేఖ పాణిగ్రాహికు నివాళు అర్పించుకోవడం అంటే శ్రీకాకుళ ఉద్యమాన్ని ఆనాటి కాలమాన పరిస్థితులు నెమరు వేసుకోవడం, భవిష్యత్తు ప్రజా ఉద్యమాలకు బావుటల వేయడమేనని వక్తలు అన్నారు. ఈనెల 7 వ తారీఖున జరుగు సంతాప సభకు బొడ్డపాడు గ్రామ ప్రజలు,యువజనలు , మహిళలు అందరూ సంతాప సభలో పాల్గొని విజయవంతం చేయాలని సంతాప సభ నిర్వహణకమిటి పిలుపు నిచ్చింది. సురేఖ పాణిగ్రాహి సంతాప సభ నిర్వహణ కమిటీ కన్వీనర్ జోగి కోదండరావు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామడ సన్యాసిరావు, సిపిఐ యంయల్ నాయకులు కోనేరు రమేష్, అమర్ల బంధుమిత్రుల కమిటీ నాయకులు తామాడ త్రిలోచనారావు, ప్రజా సంఘాల,రైతు సంఘాల నాయకులు,మద్దిల రామారావు, గొరకల బాలక్రిష్ణ, వంకల పాపయ్య, కుత్తుం దుష్యంత్, మహిళా సంఘం నాయకులు పోతనపల్లి కుసుమ, సామాజిక కార్యకర్త పోతనపల్లి అరుణ, బొడ్డపాడు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కిశోర్‌కు పరామర్శ



**పలాస, ఆగస్టు 3, (వార్త):** విశాఖపట్నం కేజీహెచ్‌లో పలాస మండలం చినంచల గ్రామానికి చెందిన పొట్నూరు కిషోర్‌కి చికిత్స పొందుతున్నాడు. దువ్వాడ శ్రీధర్ బాబా, సిర్ల రవిచంద్ర(బుజ్జి), కూన హేమాచలం, దేవేంద్ర, కంచరాన మధు, బమ్మిడి సురేష్, దవల శ్యాంసుందర్, కొవ్వూరు సంతోష్ తదితరులు ఆయనను పరామర్శించారు.

## 5న విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా





**పలాస, ఆగస్టు 3, (వార్త):** స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయవద్దని ఈనెల 5 వ తేదీన విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద చేపడుతున్న ధర్నాను విజయవంతం చేయాలని సిపిఎం నాయకులు ఎన్ గణపతి పిలుపునిచ్చారు. ప్రజలపై భారాలు మోపే స్మార్ట్ మీటర్లు పెట్టొద్దు, పెంచిన విధ్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో కాశీబుగ్గ సూది కొండ, పలు ప్రాంతాల్లో ఆదివారం ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదాని వంటి కార్పొరేట్‌లకు లాభాలు చేకూర్చేందుకు విధ్యుత్ సంస్కరణలు తెచ్చి వినియోగదారులపై భారాలు బలవంతంగా రుద్దడం సరైందికాదని అన్నారు. ప్రభుత్వాలు ఏవైనా విధానాలు ఒకటేనని, ప్రజలను మోసం చేయడమే వారి విధానం అని అన్నారు. ఇప్పటికే మోయలేని భారాలు ప్రజలు మోస్తున్నారని, స్మార్ట్ మీటర్లు వస్తే ప్రజలు అప్పులు పాలై అదోగతి పాలవుతారని అన్నారు. విద్యుత్ చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు ప్రతిపాధన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. 5 న జరిగే నిరసన ద్వారా ప్రభుత్వ విధానం తప్పని రుజువు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి అజయ్ కుమార్, తెప్పల రాజు, జె లోకనాదం, యం రాజు, యం నిర్మల, కె సుహాసిని, టి సిమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబును గెలిపించి.. ప్రజలు ఓడిపోయారు!

- బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీలో వక్తలు



**మందస, ఆగస్టు 3(వార్త):** చంద్రబాబును గెలిపించి.. ప్రజలు ఓడిపోయారని వైకాపా నాయకులు అన్నారు. మందస మండలంలోని లొహరిబంద, హరిపురం పంచాయతీలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం సర్పంచ్ జగన్నాథపురం పురుషోత్తం, సర్పంచ్ ప్రతినిధి రాపాక శేషగిరిరావు ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ బాబు ష్యూరిటీతో మోసం గ్యారంటీ అయ్యిందని, రీకాల్ చంద్రబాబు మ్యానిఫెస్టోపై అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రజలంతా తప్పు చేశామని, ప్రస్తుతం బాధపడుతున్నారని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు సూచనలతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. నేరుగా ప్రజల వద్దకు వెల్లి క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేయించి చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వీడియో రూపంలో వివరించారు. కార్యక్రమంలో ముఖ్య నాయకులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## మొక్కలు నాటిన అలయన్స్

**ఇచ్ఛాపురం, ఆగస్టు 3 (వార్త):** స్నేహితులదినోత్సవం సందర్భంగా అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, స్థానిక సురంగి రాజావారి మైదానంలో 30 నీడనిచ్చే,ఔషదీయ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు లోపింటి నరసింహ మూర్తి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యతన్నారు. అందరం మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతగా తీసుకొని వాతావరణ కాలుష్య నివారణ కు తోడ్పాడాలన్నారు. కార్యక్రమంలో ఉమాశంకర్, బత్తుల వెంకటరమణ, యోగి, దక్కత గోపి, బుజ్జి, వెంకట్రావు, లోహిదాస్, రఘు, బబ్బుల, తదితరులు పాల్గొన్నారు.



# వాసుదేవం మాస్టారు.. సమాజ నిర్దేశకులు

### * పాఠశాల నిర్మాణానికి మట్ట కుటుంబం రెండెకరాలు దానం * సంతాపసభలో వక్తలు

**మందస, ఆగస్టు 3(వార్త):** ఆంధ్రప్రదేశ్ విశ్రాంత ఉద్యోగుల సంఘం మందస మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు అంపోలు త్రినాధ రావు, వాయిలపల్లి నారాయణరావులు ఆధ్వర్యంలో ఇటీవల స్వర్గస్తులైన మట్ట వాసుదేవం మాస్టర్ సంతాప సభ ఆయన స్వగ్రామమైన భైరిసారంగపురం నిర్వహించారు. ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, మందస మండల పరిషత్ అధ్యక్షుడు డొక్కరి దానయ్య మాట్లాడుతూ వాసుదేవం మాస్టారు మారుమూల ప్రాంతంలో పుట్టినప్పటికీ ఉపాధ్యాయునిగా, విద్యాశాఖ అధికారిగా, సాహితీవేత్తగా సమాజానికి ఆదర్శప్రాయ దిశానిర్దేశం చేసిన మహనీయుడని కొనియాడారు. ఆయన ఆధ్వర్యంలో బీఎస్ పురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మట్ట కుటుంబాల నుండి రెండు ఎకరాల భూమిని, ఇతర సదుపాయాలను కల్పించి, గ్రామంలో బాలికా విద్యకు ఆయన చూపిన చొరవను పలువురు గుర్తు చేశారు. తన కుటుంబము నుండి ఆరుగురు డాక్టర్లను సమాజానికి అందించి ఉన్నత కుటుంబ వ్యవస్థ నిర్మాణంలోఆదర్శంగా నిలిచారని పలువురు కొనియాడారు. వాసుదేవం కుమారులైన అసిస్టెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రవిక్రిష్ణ, డాక్టర్ సూర్యం మాట్లాడుతూ వాసుదేవం కలం నుండి వెలువడిన సాహిత్యాన్ని పుస్తక రూపంలో సమాజానికి అందించడానికి కృషి చేస్తామని తెలిపారు. విద్యా వ్యాపారానికి గురవుతున్న తరుణంలో సామాజిక స్పృహతో కూడిన చైతన్యాన్ని అందించి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దినప్పుడే అధ్యాపనం గొప్ప



నమూనాగా నిలుస్తుందని, ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నవారు ఆ దిశగా అడుగులు వేయాలని, వాసుదేవంమాస్టర్ చిరకాల కోరికను ఆయన రచనల ద్వారా తీర్చుటకు మా వంతు ప్రయత్నం చేస్తామని తెలిపారు. సంతాప సభలో శాస్త్రవేత్త డాక్టర్ కంచరాన ఆనందరావు, ఎంపీటీసీ ప్రతినిధి ఎం.షణ్ముఖరావు, తెలుగుదేశం నాయకుడు మట్ట మాధవరావు, ప్రముఖ న్యాయవాది సర్వేశ్వరరావు, మండల విద్యాశాఖ అధికారులు ఎస్.విశ్వనాథం, సీహెచ్ శ్రీనివాసరావు, డా.ఎన్.క్రిష్ణంరాజు, డాక్టర్ డి.శ్రీకాంత్ , విశ్రాంత ఎంపీడీవో సూర్యనారాయణ రెడ్డి, విశ్రాంత విద్యాశాఖ అధికారులు గుంట చక్రపాణి, మజ్జి బాబురావు, యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ గుంట కోదండ రావు, మండల శాఖ ప్రధాన కార్యదర్శి దాసరి ఈశ్వరరావు, విద్యావేత్తలు, వైద్యులు, గ్రామ ప్రజలు, సామాజికవేత్తలు పాల్గొన్నారు.



# తైక్వాండో పోటీలలో ఇచ్ఛాపురం క్రీడాకారుల ప్రతిభ

**ఇచ్ఛాపురం, ఆగస్టు 3 (వార్త):** విజయవాడ చెల్లుపతి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో గత నెల 25 నుండి 27 వరకు జరిగిన జాతీయస్థాయి తైక్వాండో ఓపెన్ నేషనల్ పోటీల్లో ఇచ్ఛాపురం క్రీడాకారులు పాల్గొని పథకాలు సాధించారు. ఈ పథకాలు సాధించిన చిన్నారులకు స్థానిక ఇచ్ఛాపురం తైక్వాండో క్లాస్ ఆవరణలో అభినందన సభ కార్యక్రమం నిర్వహించారు. సబ్ జూనియర్ విభాగంలో పిలక లాస్యన్ రెడ్డి, మహేష్, జోషిక, కృతిజ్ఞ , ఉపాసన బంగారు పతకాలు సాధించారు భవిష్య, వర్షిని ,సత్య శ్రీ, యశ్వంత్ ,సాయి సిద్ధార్థ రజిత పథకాలు సాధించగా సోనాక్షి, సాయి చాణిక్య, అభిరామ్, కాంచ పథకాలు సాధించారు. సబ్ జూనియర్ రెగ్యులర్ కేటగిరీలో యశ్విత బంగారు పథకం హర్షిని రజిత పథకం, క్యాడేట్ విభాగంలో పటాన దమ్యంతి బంగారు పతకం చెన్నూరు జాహ్నవి రజిత పథకం సాధించారు. జూనియర్ విభాగంలో సిహెచ్ గిరి కాంస్య పథకం సాధించారు. సీనియర్ విభాగంలో అనపాన భువనేశ్వరి రజిత పథకం అనపాన డోలి కాంచపతకం సాధించారు. పూమ్సే విభాగంలో అనపాన డోలి రజిత పథకం పిలక సత్య శ్రీ కాంస్య పథకం, ఆనం కృతజ్ఞ కాంస్య పథకం పథకం సాధించారు



ఈ చిన్నారులకు అభినందన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డాక్టర్ వజ్రపు కీర్తన, డాక్టర్ శేషు యాదవ్, పిలక విజయ్ భాస్కర్ రెడ్డి, సుగ్గు ప్రేమ్ కుమార్, చాట్ల తిరుపతి, యువ సూర్య చారిటబుల్ ట్రస్ట్ అధినేత రాంబాబు మరియు ఉప్పాడ ఆనంద్ , ఆర్మీ విశ్రాంత ఉద్యోగి ఎల్ సి రావు , ప్రభుత్వ బాలుర పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ ఆశి లత సీనియర్ క్రీడాకారులు శ్రీను పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి బత్తిన కృష్ణయ్య సభ అధ్యక్షునిగా వ్యవహరించారు.

## రెడ్డిక సంఘం స్తూపం నిర్మాణానికి భూమిపూజ

**ఇచ్ఛాపురం, ఆగస్టు 3 (వార్త):** ఇచ్చాపురం జోన్ పూరి, గంజాం, శ్రీకాకుళం రెడ్డిక మహాజన పురోభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో రెడ్డికల ఐక్యతను చాటిచెప్పేలా వందేళ్ల సంఘ ఖ్యాతిని భవితరాలకు అందించేందుకు, స్తూపం నిర్మాణానికి భూమిపూజ చేశారు. కొత్త కొజ్జిరియా రెడ్డికుల సంఘ భవన ప్రాంగణంలో స్టాట్యూ ఆఫ్ రెడ్డిక యూనిటీ స్తూపాన్ని నిర్మించుకునేందుకు జోన్ రెడ్డిక కుల సంఘ పెద్దలు హాజరయ్యారు. స్తూపం నిర్మాణం 100 రోజులలో పూర్తి చేసుకుని 100 ఏళ్ళ వేడుకలు నిర్వహణకు తీర్మానించారు.





## సనాతన ధర్మాన్ని అచరించాలి

**ఇచ్ఛాపురం, ఆగస్టు 3 (వార్త):**రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఇచ్చాపురం ఆధ్వర్యంలో జరిగినటువంటి మండల సాంఘిక్ కార్యక్రమాన్ని దక్షిణ మధ్య క్షేత్ర ప్రచారక్ భరత్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక జ్ఞానభారతి స్కూల్లో ధర్మ సమ్మేళనంలో మొల్లేటి గణపతిరావు, వెచ్చ కేశవరావు , పాక తులసీదాసు, విశ్వహిందూ పరిషత్ ప్రకండా అధ్యక్షులు, గోనప దాసప్ప రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ ద్విఖండ సంఘచాలక పాల్గొన్నారు.



## పదో తరగతి విద్యార్థులు పూర్వ కలయిక

**ఇచ్ఛాపురం, ఆగస్టు 3 (వార్త):**ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1999–2000 పదో తరగతి విద్యార్థులు పూర్వ కలయిక వైభవంగా జరిగింది. స్థానిక స్కూల్ ఆవరణలో విద్యార్థులు గత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరినొకరు ప్రస్తుత స్థితిని పరిచయం చేసుకున్నారు. ఉపాధ్యాయులను సన్మానించారు. భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. ఆటలు పాటలు సాంస్కృతిక కార్యక్రమాలతో స్నేహితులు దినోత్సవ వేడుకలు నిర్వహించారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక

**శ్రీకాకుళం, ఆగస్టు 3 (వార్త):** ప్రజా ఫిర్యాదుల నమోదు పరిష్కార వేదిక జిల్లా పరిషత్‌లో సోమవారం నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్ లో ఉపయోగించుకోవాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీ దారుల అర్జీల నమోదు మరియు నమోదైన అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి సమాచారం గూర్చి తెలుసుకోవాలంటే 1100 కి నేరుగా కాల్ చేయవచ్చని వివరించారు.

## నేడు వంశధార సాగునీరు సాధన కమిటీ సమావేశం

**మందస, ఆగస్టు 3(వార్త):** వంశధార సాగునీరు సాధన కమిటీ ప్రత్యేక సమావేశం సోమవారం సాయంత్రం 6గంటలకు జరుగుతుందని వంశధార సాగునీరు సాధన కమిటీ అధ్యక్షుడు మార్పు మన్మధరావు ఒక ప్రకటనలో చెప్పారు. మందస మండలంలోని హరిపురంలో గల మార్పు గ్రంథాలయములో కమిటీ సమావేశం నిర్వహించనున్నామని, సభ్యులందరూ తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

## ఆటో యూనియన్ నూతన కార్యవర్గ ఎన్నిక

**ఇచ్ఛాపురం, ఆగస్టు 3 (వార్త):**భగవతి స్వేచ్ఛావతి ఆటో యూనియన్ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. 26వ వార్షికోత్సవం సందర్భంగా కొండ శంకర్ రెడ్డి, అనపాన భైరి ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడుగా నీలాపు ప్రకాష్ రెడ్డి, (చిన్న), ఉపాధ్యక్షుడుగా ఎన్.మాధవ్ రెడ్డి, కార్యదర్శిగా కె.లోకేష్, ( తులసీ), కోశాధికారిగా పి మధు, జాయింట్ సెక్రటరీగా పి సి సాహులను ఎన్నుకున్నారు.

## అరకభద్రలో బాబు ష్యురిటీ మోసం గ్యారంటీ



**ఇచ్ఛాపురం, ఆగస్టు 3 (వార్త):** ఆరకభద్ర పంచాయతీలో బాబు స్యూరిటీ మోసం గ్యారెంటి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బోర పుష్ప, సీడప్ మాజీ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్ రెడ్డి, గ్రామ ఎంపీటీసీ సాడి కాంచన దేవి, శాసనం సర్పంచ్ త్రినాధ రెడ్డి, కేసు పురం సర్పంచ్ ఢిల్లీ రావు, లోద్దపుట్టి ఎంపీటీసీ ప్రతినిధి పిట్ట ఆనంద్, కేదారి, సంతోష్ మండలో, నీలాద్రి పుణ్యవాసులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## నారీశక్తిపై అవగాహన

**ఇచ్ఛాపురం, ఆగస్టు 3 (వార్త):** నారీశక్తిపై ఈదుపురం పెట్రోల్ బంక్ సమీపంలోలో మహిళలకు పోలీసులు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, మహిళా రక్షణ, బాల్య వివాహాలు, గుడ్ టచ్ బాడ్ టచ్ గురించి వివరించారు. 112 ,1098,1930 టోల్ ఫ్రీ నెంబర్ల పై రూరల్ ఎస్ఐ ఈ శ్రీనివాసరావు వివరించారు.




Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546